
సాక్షి
బాపట్ల
మంగళవారం, 6, ఆగస్టు, 2024



అవగాహన ర్యాలీ

కోనేటిపురం(భట్టిప్రోలు): మండలం కోనేటిపురంలో సోమవారం తల్లిపాల విశిష్టత గురించి ర్యాలీ నిర్వహించారు. రేపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ ఫజురున్నీస్సా పాల్గొన్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 5,009 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1260 క్యూసెక్కులు వదిలారు.



కలశాలతో విశేష పూజలు

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా సహస్ర కలశాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

రేపు సీఎం చంద్రబాబు చీరాల రాక



చీరాల: చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 7న చీరాలకు రానున్నట్లు పార్టీ వర్గాలు సోమవారం తెలిపాయి. ముఖ్యమంత్రి హోదాలో ఆయన మొదటిసారి చీరాల పర్యటనకు వస్తున్నారు. గతంలోనూ ఆయన చేనేత దినోత్సవం రోజున సీఎం హోదాలో చీరాలకు వచ్చారు. కష్టాల కడలిలో ఉన్న తమను ఆదుకుంటారని చేనేత కార్మికులు ఎన్నో ఆశలతో ఉన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని హెలిప్యాడ్, బహిరంగ సభ ప్రాంతాల్ని పోలీసు, రెవెన్యూ యంత్రాంగం పరిశీలించింది. జాయింట్ కలెక్టర్ సుబ్బారావు ఏర్పాట్లను పరిశీలించారు. బహిరంగ వేదికను ఇంకా నిర్ణయించలేదని ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి తెలిపారు.

టీడీపీ శ్రేణులపై కేసు నమోదు

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల తమ్మవరం రోడ్డు సమీపంలో గల సింథైట్ ఫ్యాక్టరీపై దాడి చేసిన ఘటనపై టీడీపీకి చెందిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. దాడిలో గాయపడిన ఫ్యాక్టరీ మేనేజర్ అబ్దుల్ సలామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆదివారం గ్రామస్తులతో కలసి వెళ్లిన టీడీపీ శ్రేణులు ఫ్యాక్టరీలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడంతోపాటు అడ్డువచ్చిన మేనేజర్‌ను గాయపరిచిన సంగతి తెలిసిందే.

10 నుంచి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు




వినుకొండ(నూజెండ్ల): గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్స్ సాఫ్ట్‌బాల్ స్టేట్ టోర్నమెంట్ పోటీలు గుడ్ షెపర్డ్ పాఠశాలలో ఈ నెల 10, 11,12 తేదీల్లో జరగనున్నాయని డైరెక్టర్ ఇన్నారెడ్డి తెలిపారు. క్రీడా మైదానాన్ని అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. పోటీల నిర్వహణపై చర్చించారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి పురుషులు, మహిళ జట్లు పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నరసింహారెడ్డి, చిరంజీవి, సురేష్, రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

29,31 తేదీల్లో ఐటీఐ మూడో విడత కౌన్సెలింగ్

తెనాలిఅర్బన్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 29, 31 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్, తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రావి చిన్న వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి, గుంటూరులలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో తక్కువ సీట్లు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రైవేట్ కళాశాలలో 577 సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. ఐటీఐలో చేరదలచిన వారు ఈనెల 26లోపు తమ పేర్లు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌లో నమోదు చేయించుకోవాలని వివరించారు. తెనాలి, గుంటూరులలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రంలో సర్టిఫికెట్లు తప్పనిసరిగా వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 29న, ప్రైవేట్ కళాశాలల్లో ఈనెల 31న ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందని వెల్లడించారు. వివరాలకు సెల్ నంబర్: 9347795839, 6304572793లలో సంప్రదించాలని సూచించారు.

అండర్-7 జాతీయ చెస్ పోటీలకు కావ్య



గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరుకు చెందిన ఏఎస్ఎస్ఎస్ కావ్య వచ్చే నెల 1 నుంచి 5 వరకు కర్ణాటకలోని మైసూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి సబ్ జూనియర్ చెస్ పోటీలకు ఎంపికైనట్టు శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ ఎం.గోపీనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో విజయనగరంలో జరిగిన అండర్-7 బాలికల రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో కావ్య ప్రథమ స్థానం సాధించినట్టు వెల్లడించారు.

ఉమ్మడి చిక్కుముడి

- 'బాలికా సంరక్షణ'కు లబ్ధిదారుల నిరీక్షణ
- కాలపరిమితి తీరిన ప్రభుత్వ బాండ్లు
- రెండేళ్లుగా అందని నగదు
- ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 25 వేల మంది ఎదురుచూపులు
- పట్టించుకోని స్త్రీ,శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారులు

ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మి అని భావించి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, సంక్షేమ ప్రదాత వైఎస్. రాజశేఖర్‌రెడ్డి 'బాలికా సంరక్షణ' పథకానికి అంకురార్పణ చేశారు. ఆడపిల్లకు 20 ఏళ్లు వచ్చేలోపు రూ. 1లక్ష వచ్చే విధంగా రూపకల్పన చేశారు. అయితే, రాష్ట్రం విడిపోయిన తర్వాత పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన బాండ్లు చిత్తు కాగితాలుగా మారాయి. తెలంగాణ ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు. స్త్రీ,శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారులు కూడా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.



చీరాల/వేటపాలెం: పేద కుటుంబాల్లో ఆడపిల్ల పుడితే కుటుంబానికి పెద్ద భారంగా భావించే రోజులు అవి. కట్న కానుకలు ఇచ్చి పెళ్లిళ్లు చేయలేని పరిస్థితి. మహిళ గర్భం దాల్చిన తరువాత ఆడ పిల్ల అని తెలుసుకొని కడుపు కోతలే అధికంగా ఉండేవి. ఆడ పిల్లలపై వివక్షకు అడ్డుకట్ట వేయాలని భావించిన అప్పటి ప్రభుత్వం సదుద్దేశంతో ఉమ్మడి రాష్ట్రంలో 2005లో బాలికా సంరక్షణ పథకాన్ని అమలు చేసింది. ఒక ఆడ పిల్లపుడితే రూ.1 లక్ష, ఇద్దరు పుడితే చెరో రూ.30 వేలు అందజేసే విధంగా రూపకల్పన చేశారు. ఆడపిల్లకు 20 సంవత్సరాలు వచ్చేలోపు రూ. 1లక్ష చేతికి అందుతాయని పేద, బడుగు వర్గాలు ఎంతో ఆశపడ్డాయి. మరి కొంత వేసుకొని పిల్ల పెళ్లి చేసి అత్తగారింటికి సాగనంపవచ్చని కలలు కన్నారు.

ఆశలు అడియాస

పథకం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. రాష్ట్రంలో విడిపోయిన తర్వాత పట్టించుకునే వారు కరువయ్యారు. అనుకున్న విధంగానే పథకంలో లబ్ధిదారులైన ఆడ పిల్లలకు 20 ఏళ్లు దాటాయి. ప్రభుత్వం ఇచ్చిన ఎల్‌ఐసీ బాండ్ల గడువు ముగిసినా తల్లిదండ్రుల చేతికి నయా పైసా అందలేదు. బాండ్లను స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అందజేసి దరఖాస్తు చేసుకున్నప్పటికీ, సంబంధిత అధికారుల నుంచి ఉలుకూపలుకూ లేదు. అసలు ఇస్తారోలేదో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. బాండ్ల కాల పరిమితి ముగిసి రెండేళ్లు అవుతున్నప్పటికీ దానిపై ఎటువంటి స్పందన లేకుండా పోయింది.



లబ్ధిదారులకు ఇచ్చిన ఎల్‌ఐసీ బాండు

జిల్లా వ్యాప్తంగా 1192 మంది దరఖాస్తు

స్త్రీ,శిశు సంక్షేమ శాఖ నుంచి అందుకున్న బాండ్ల కాలపరిమితి ముగియడంతో పథకం కింద అందాల్సిన నగదు మంజూరు చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా 1192 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో కొందరైతే సంవత్సరంగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుతం కాల పరిమితి ముగిసిన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు కూడా తీసుకోవడం లేదు. ముందు ఇచ్చిన బాండ్లకు ఇంత వరకు నగదు అందలేదు. కాల పరిమితి ముగిసిన వందల సంఖ్యలో లబ్ధిదారులు తమకు నగదు ఇవ్వాలని దరఖాస్తులు చేసుకోవడానికి ఇంకా సిద్ధంగా ఉన్నారు. ఇప్పటి కైనా ప్రభుత్వం కలుగజేసుకొని న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



బాలికా సంరక్షణ పథకానికి సంబంధించి లబ్ధిదారులకు ఇచ్చిన ఎల్‌ఐసీ బాండ్ల కాల పరిమితి ముగిసింది. ఇప్పటివరకు 1,192 మంది నగదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ పథకం ఉమ్మడి రాష్ట్రంలో అమలు చేసినది. తెలంగాణ నుంచి ఈ పథకం తాలుకూ నగదు రాలేదని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లాం. త్వరలో పరిష్కారానికి చర్యలు తీసుకొంటాం.

– ఉమ, పీడీ, స్త్రీ, శిశుసంక్షేమశాఖ, బాపట్ల

పథకం ఉద్దేశం ఇది

ఉమ్మడి రాష్ట్రంలో ఆడపిల్లల రక్షణ కోసం స్త్రీ,శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 5 మే 2005న జీఓ నంబర్-16తో ఆడపిల్ల సంరక్షణ పేరుతో జీవో అమల్లోకి తెచ్చారు. పేదవర్గాలకు చెందిన ఇంట్లో ఒక ఆడపిల్ల ఉంటే రూ.1 లక్ష , ఇద్దరు ఆడ పిల్లలు ఉంటే రూ. 30 వేల చొప్పున పథకం అమలు చేశారు. 0 నుంచి 5 ఏళ్ల లోపు ఆడపిల్లల ఉన్న కుటుంబాలు అర్హులుగా ప్రకటించారు. అప్పటి ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో దాదాపు 25 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిని అర్హులుగా గుర్తించి ఎల్‌ఐసీ బాండ్లు అందజేశారు. కాల పరిమితి 20 సంవత్సలుగా నిర్ణయించారు. ఆడపిల్లలు తప్పనిసరిగా ఇంటర్ మీడియట్ వరకు చదువుకుంటేనే అర్హులని ప్రకటించారు. ఈ బాలికలకు పది, ఇంటర్ చదువుకొనే సమయంలో ఉపకార వేతనాలు కూడా అందజేశారు.



ముంపు గ్రామాలలో ముందస్తు చర్యలపై దృష్టి

రేపల్లె సబ్ కలెక్టర్ హేలా షారోన్



చింతర్లంకలో ప్రజలకు సూచనలిస్తున్న రేపల్లె సబ్ కలెక్టర్ హేలా షారోన్

కొల్లూరు : కృష్ణా నదికి వరదలు సంభవించే అవకాశాలు మెండుగా ఉన్న నేపథ్యంలో ముంపు గ్రామాల్లో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై పూర్తి దృష్టి కేంద్రీకరించాలని రేపల్లె సబ్ కలెక్టర్ హేలా షారోన్ ఆదేశించారు. సోమవారం కృష్ణా పరీవాహక లంక గ్రామాలలో పర్యటించిన ఆమె ప్రజలను అప్రమత్తం చేశారు. వరద సమయంలో తలెత్తే ఇబ్బందులను అడిగి తెలసుకున్నారు. ప్రభుత్వ యంత్రాంగం తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. నాగార్జున సాగర్ నుంచి దిగువకు వరద నీరు విడుదల చేస్తున్న నేపథ్యంలో మూడు రోజుల వ్యవధిలో కృష్ణా నదికి వరద నీరు వచ్చే అవకాశాలున్నాయని ఆమె ప్రజలకు వివరించారు. వరద ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉన్నందున ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలి రావాలని ప్రజలకు సూచించారు. కొల్లూరు, చిలుమూరు, దోనేపూడి గ్రామాల్లోని పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. వరద ప్రాంత వాసులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వ యంత్రాంగం బృందాలను ఏర్పాటు చేసి, సహాయ సహకారాలు అందజేయనున్నట్లు తెలిపారు. మందులను, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సిబ్బంది ఎటువంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా సకాలంలో స్పందించి సమస్యలను పరిష్కరించాలని, వీరిపై పర్యవేక్షణకు రేపల్లె ఆర్డీఓ కార్యాలయం నుంచి బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం కొల్లూరు మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ప్రభుత్వ శాఖల అధికారులతో సబ్ కలెక్టర్ సమీక్ష నిర్వహించి, శాఖల వారీగా వరదల సమయంలో చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

చిరుద్యోగులకు 'చంద్ర' గ్రహణం

- కక్ష సాధింపులకు తెరతీసిన కూటమి సర్కార్
- జిల్లాలో 90 మంది యానిమేటర్ల తొలగింపు
- ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశావర్కర్లకు ఉద్వాసన
- మధ్యాహ్న భోజన నిర్వాహకులు, శానిటేషన్ వర్కర్లను వదలని వైనం
- నెలల తరబడి జీతాలు చెల్లించకుండానే తొలగింపు
- నేతల తీరుపై మండిపడిన చిరుద్యోగులు
- తొలగింపును నిరసిస్తూ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా
- విధుల్లోకి తీసుకోకపోతే ఉద్యమాలు ఉధృతం



జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న చిరుద్యోగులు

బాపట్ల టౌన్: పొదుపు సంఘాలను స్థాపించిందే నేను.. మహిళల ఆర్థికాభివృద్ధే నా లక్ష్యం.. నేను శాశ్వతంగా మీకు అన్నగా ఉంటా.. డ్వాక్రా సంఘాలను బలోపేతం చేస్తా...పొదుపు సంఘాలు నా మానస పుత్రికలు అంటూ ఎన్నికల సమయంలో ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన రెండునెలల్లోనే చిరుద్యోగులపై వేటు వేశారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక నిర్ణయాలకు నిరసనగా సోమవారం యానిమేటర్లు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, శానిటేషన్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు.. ఇలా అన్ని రంగాలకు చెందిన చిరుద్యోగులు ఆందోళనకు దిగారు. రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేని తమపై రాజకీయ ముద్ర వేసి అకారణంగా విధుల నుంచి తొలగించడం ఏమిటని ఆగ్రహించారు.కొన్ని ప్రాంతాల్లో తొలగించేందుకు పొదుపుసంఘాల మహిళలు తీర్మానం చేసేందుకు అంగీకరించకపోయినప్పటికీ ఆయా ప్రాంతాల్లోని రాజకీయనాయకులు సంతకాలు పెట్టకపోతే సంక్షేమ పథకాలు మొత్తం నిలుపుదల చేస్తామంటూ బెదిరించి పెట్టించుకుంటున్నారని యానిమేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో టీడీపీ నాయకులు చిరుద్యోగులైన యానిమేటర్లపై రాజకీయ ముద్రవేసి వారిని అకారణంగా విధులు నుంచి తొలగించారని అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు జెపంగులూరు మండలంలో 21, యద్దనపూడి-10, మార్టూరు 14, అద్దంకి - 8, పిట్టలవానిపాలెం-1, చెరుకుపల్లి - 3, నగరం- 21, చుండూరు- 12 మంది చొప్పున జిల్లాలో ఇప్పటివరకు 90 మంది యానిమేటర్లను విధుల నుంచి తొలగించారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళనకు దిగుతామని తెలిపారు

26 ఏళ్లుగా పనిచేస్తున్నా



యానిమేటర్‌గా 1998లో చేరా. అప్పటి నుంచి సిరిపూడిలో విధులు నిర్వర్తిస్తున్నా. నా పరిధిలో 43 గ్రూపులున్నాయి. నేను ఏనాడూ రాజకీయాల గురించి ఆలోచించలేదు. నా వయస్సు 50 ఏళ్లు. భర్త ఎనిమిదేళ్ల కిందట అనారోగ్యంతో చనిపోయాడు. నాకు ముగ్గురు పిల్లల్లో ఇద్దరికి పెళ్లి చేశాను. మరొక బాబు చదువుకుంటున్నాడు. బిడ్డల భవిష్యత్ కోసం నానా కష్టాలు ఎదుర్కొంటున్న సమయంలో నాపై రాజకీయ రంగు పులిమి విధుల నుంచి తొలగించడం బాధాకరం. ఇన్నాళ్ళల్లో ఏ ఒక్క గ్రూపులోని సభ్యురాలిని కూడా నేను ఇబ్బంది పెట్టలేదు.

– ఉప్పలపాటి ఏసుమణిమ్మ, యానిమేటర్, సిరిపూడి, నగరం మండలం

బెదిరించి తొలగిస్తున్నారు



నేను 2012 నుంచి యానిమేటర్‌గా పని చేస్తున్నా. ఏ రోజు ఎక్కడా కూడా రాజకీయాలు మాట్లాడటం గానీ, చేయడం గానీ నాకు తెలియదు. కేవలం టీడీపీ నాయకులు వారికి సంబంధించిన వ్యక్తులను నియమించుకోవాలనే దురుద్దేశంతో మమ్ములను తొలగించారు. నెల రోజుల నుంచి ఒక్కటే బెదిరింపులు. నా పరిధిలో 26 గ్రూపులున్నాయి. లీడర్లకు ఫోన్‌చేసి మీరంతా ఆమె మాకు వొద్దు అని తీర్మానం చేయండి అంటూ బెదిరిస్తున్నారు. ఏపీఎం, సీసీల ద్వారా మాకు ఫోన్ చేయించి తప్పుకోమని చెప్పిస్తున్నారు. మేము ఏం తప్పుచేశామని అడిగితే సమాధానం చెప్పడం లేదు. మాపై కక్ష సాధింపు చేయడం సరికాదు.

– దుద్దు కోటేశ్వరమ్మ, యానిమేటర్, చిమ్మిరిబంద,మార్టూరు మండలం

నాడు ఇచ్చారు...నేడు తొలగించారు



నేను యానిమేటర్‌గా 2014లో టీడీపీ పాలనలోనే చేరా. అప్పటి నుంచి చిమ్మిరిబండ గ్రామైక్య సంఘం పరిధిలో విధులు నిర్వర్తిస్తున్నా. నేను గానీ, మా కుటుంబ సభ్యులు గానీ ఏనాడూ రాజకీయాల్లో తిరిగింది లేదు. అసలు మమ్ములను ఎందుకు తప్పుకోమంటున్నారు అని అడిగితే సమాధానం చెప్పడం లేదు. నా పరిధిలోని 25 గ్రూపులున్నాయి. వారిని బెదిరించి సంతకాలు పెట్టించుకుంటున్నారు. నేను టీడీపీ పాలనలో యానిమేటర్ అయినప్పటికీ గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ నాయకులు మా గ్రామాల్లో ఏ ఒక్కరినీ తొలగించలేదు.

– దుద్దు పద్మ, యానిమేటర్, చిమ్మిరిబండ, మార్టూరు మండలం

కలెక్టర్‌ను కలిసినా ఫలితం శూన్యం



నేను పమిడిపాడు జిల్లా పరిషత్ హైస్కూలులో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలిగా 2008లో చేరా. ఇప్పటికి నేను 16 సంవత్సరాలుగా పనిచేస్తున్నా. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నా పని..నేను చేసుకుంటూనే ఉన్నాను. పాఠశాలలు తెరిచిన తర్వాత యథావిధిగా పాఠశాలకు వెళ్లాను. జూన్ 16న హెచ్‌ఎం పట్టాభి రామిరెడ్డి మాకు రాజకీయ ఒత్తిళ్లు పెరిగాయి.. విధులు నుంచి తొలగాలన్నారు. ఇదేమని అడిగితే సమాధానం చెప్పలేదు. జూన్ 21న విధుల నుంచి తొలగించారు. కలెక్టర్‌కుమూడుసార్లు అర్జీలు ఇచ్చినా ఫలితం లేదు.

– బేతంశెట్టి కనకమ్మ,మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, పమిడిపాడు, కొరిశపాడు మండలం

దంపతులిద్దరినీ తొలగించారు



కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శానిటేషన్ వర్కర్‌గా పని చేస్తున్నా. హైస్కూల్‌లో మొత్తం 16 మరుగుదొడ్లు ఉన్నాయి. నిత్యం వాటిని శుభ్రం చేస్తూ జీవనం సాగిస్తుంటా. నా భర్త ఆదినారాయణ అదే పాఠశాలలో వాచ్‌మేన్‌గా పనిచేస్తారు. మేము ఏనాడూ రాజకీయాల్లో తిరిగింది లేదు. కేవలం వాళ్ల మనుష్యులను పెట్టుకోవాలనే దురుద్దేశంతో మా ఇద్దరినీ తొలగించారు. జీతాలు కూడా ఇవ్వలేదు.

– పేరం మానస , శానిటేషన్ వర్కర్, కొరిశపాడు మండలం

ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం

డీఆర్వో సీహెచ్. సత్తిబాబు



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు

బాపట్ల: ప్రజల సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు అర్జీల ద్వారా తమ సమస్యల్ని విన్నవించారు. 156 అర్జీలు నమోదయ్యాయి. ప్రజల్ని కార్యాలయాల చుట్టూ తిప్పించుకోరాదని డీఆర్వో అధికారుల్ని ఆదేశించారు. ఫిర్యాదుల్ని తక్షణం పరిష్కరించి ప్రజలకు మంచి సేవలు అందించాలని సూచించారు.

కుల గణన చేపట్టాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న ఇండియా కూటమి నాయకులు

దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని కోరుతూ ఇండియా కూటమి నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబుకు వినతి పత్రం అందించారు. 1931లో జరిగిన కుల గణన ప్రాతిపదికన 2024 ఓబీసీ రిజర్వేషన్లు ఏ విధంగా అమలు చేస్తారని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మేధ శ్రీనివాసరావు, జెబి శ్రీధర్, దేవరాజ్ ఉన్నారు.

– ఇండియా కూటమి నాయకులు

గిరిజనులకు స్థలాలు ఇవ్వాలి




జైభీమ్ రావ్ భారత్ పార్టీ వినతి

గిరిజనులకు నివేశన స్థలాలు ఇప్పించాలని కోరుతూ జై భీమ్ రావ్ భారత్ జిల్లా అధ్యక్షుడు పి.కోటేశ్వరరావు డీఆర్వోకు వినతి పత్రం అందించారు. గిరిజనులు స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సూర్యలంక, అడవి పంచాయతీలోని 20కుటుంబాలు నివేశన స్థలాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

–కోటేశ్వరరావు, జై భీమ్ రావ్ భారత్ పార్టీ

ముంపు గ్రామాల్లో అప్రమత్తం

- నాగార్జున సాగర్ నుంచి భారీగా చేరుతున్న వరదనీరు



కేతవరం సమీపంలో నిండుకుండలా కృష్ణానది

బెల్లంకొండ: నాగార్జున సాగర్ నుంచి దిగువ ప్రాంతాలకు నీరు విడుదల చేయడంతో పులిచింతల ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. సోమవారం నుంచి ఒక్కసారిగా భారీగా వరదనీరు కృష్ణా నదికి వచ్చి చేరింది. సాగర్ నుంచి 16 గేట్లు పైకి ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో పులిచింతల ప్రాజెక్టు పరిధిలో నీటి నిల్వ గంట గంటకు పెరుగుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులోకి నీరు అధికంగా వస్తుండడంతో మండలంలోని ముంపు గ్రామాల్లో వరదనీరు ప్రవహించనుంది. కాగా ఐదేళ్ల క్రితమే ముంపు గ్రామాలలో ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. గత కొనేళ్లుగా కొంతమంది రైతులు మెరక ప్రాంతాలలో ఉన్న పొలాలను సాగుచేసుకుంటున్నారు. అదేవిధంగా జిల్లాలోని ఇతర ప్రాంతాలకు చెందిన పశువులు, జీవాల కాపరులు ముంపు గ్రామాలలో నివాసం ఉంటూ, వాటిని మేపుకొని జీవనం సాగిస్తున్నారు. గ్రామాలకు వరద ప్రవాహం పోటెత్తడంతో రెవెన్యూ, పోలీసు శాఖ అధికారుల అప్రమత్తం అయ్యారు. ప్రాజెక్టు పరిధిలోని ముంపు గ్రామాలైన పులిచింతల, గొల్లపేట, కోళ్లూరు గ్రామాల వద్ద నీటి మట్టం దాదాపుగా నది ఒడ్డులకు తాకుతోంది. కేతవరం లక్ష్మీ నరసింహస్వామి పాత ఆలయం ప్రాంతాన్ని దాటి నీరు ఎమ్మాజీగూడెం వైపునకు వస్తోంది. చివరి ముంపు గ్రామమైన ఎమ్మాజీ గూడెం గ్రామం పాక్షికంగా ముంపులో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు. వరద ప్రవాహం పెరుగుతుండడంతో అధికారులు నివాస ప్రాంతాలకు వెళ్లి వెంటనే పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని సూచిస్తున్నారు. ఎస్‌ఐ రాజేష్, తహసీల్దార్ అప్రపున్నీసా బేగంలు ముంపు గ్రామాల ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుడి వాహనం దహనం



ఎర్రబాలెం(క్రోసూరు): పల్నాడు జిల్లా క్రోసూరు అనుబంధ గ్రామమైన ఎర్రబాలెం ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు గుమ్మడి ఏసుబాబుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. ఏసుబాబు తెలిపిన వివరాల మేరకు.. ఇంటి ముందు తన గ్లామర్ ద్విచక్రవాహనం పార్కింగ్ చేశారు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వాహనంపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టారు. సోమవారం ఉదయం విషయం వెలుగుచూసింది. దీనిపై పోలీసులు ఇంకా కేసు నమోదు చేయలేదు.

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలి

గురజాల ఎమ్మెల్యే యరపతినేనికి సీఐటీయూ వినతి

పిడుగురాళ్ల: చిరుద్యోగులు, స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షులు తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ... కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు పెరిగాయని తెలిపారు. ఎలాంటి నోటీసులు, ముందస్తు సమాచారం లేకుండా దౌర్జన్యంగా తొలగించటం అన్యాయమని పేర్కొన్నారు. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించటం పద్ధతి కాదన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో షేక్ హజ్రా, శాంతమణి, బుజ్జి, వెంకట రావమ్మ, శివరంజని తదితరులు ఉన్నారు.

నిరాదరణలు.. వేధింపులు.. కబ్జాలు

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితుల మొర
- అండగా ఉంటామని అడిషనల్ ఎస్పీ హామీ



అడిషనల్ ఎస్పీముందు సమస్యలు విన్నవించుకుంటున్న బాధితులు

బాపట్ల టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ గోడును వెళ్లబోసుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి సోమవారం 55 మంది బాధితులు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. సమస్యల్ని క్షుణ్ణంగా తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్ సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడి, తక్షణమే పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు.

కన్న కొడుకే చంపాలని చూస్తున్నాడు



మాకు నలుగురు ఆడ పిల్లలు, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. పెద్ద కుమారుడు పర్చూరు ఏడుకొండలు నాలుగు నెలల కిందట ఇంటి లోను కోసమని మమ్ముల్ని నమ్మించి తెలియకుండా ఉంటున్న ఇల్లు, స్థలం రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. వారం రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోవాలని ఇద్దరిని కొట్టాడు. మమ్ముల్ని చంపాలని చూస్తున్నాడు.ఈ విషయాన్ని ఇంకొల్లు పోలీసులకు చెప్పినా మా మొర ఆలకించడం లేదు. ఇప్పుడు కూడా మాకు న్యాయం జరగకపోతే ఇద్దరం కలిసి చచ్చిపోతాం.

-పర్చూరు పోతురాజు, సుబ్బమ్మ, పూసపాడు, ఇంకొల్లు మండలం

కన్న తండ్రే బంగారం దొంగిలించాడు

మూడు నెలల కిందట మా అమ్మకు ఆరోగ్యం బాగో లేకపోతే చెన్నైలో ఆస్పత్రికి వెళ్లాం. అక్కడి నుంచి తిరిగి జులై 22న ఇంటికి వచ్చాం. బీరువాలో చూస్తే బంగారం, వెండి వస్తువులు లేవు. ఇదేమని నా తండ్రి గౌస్ బేగ్‌ను అడిగితే తానే అమ్ముకున్నానని, ఇంకా ఎక్కువ మాట్లాడితే చంపుతానని బెదిరించాడు. వేటపాలెం పోలీసులకు ఫిర్యాదు చేస్తే మమ్ముల్నే దుర్భాషలాడుతున్నారు. మాకు న్యాయం చేయాలి.

- మొగల్ అన్సారీ బేగం, వేటపాలెం

నకిలీ దస్తావేజులతో కబ్జా

చీరాలలోని దేశాయిపేటకు చెందిన నేను ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నా. నాకు చీరాలలో కెపాల్ కాలనీలో మూడు సెంట్ల స్థలంలో డాబా ఇల్లు ఉంది. నా ఇంట్లో మా అన్న ఉంటాను అని అడిగితే ఆరేళ్ల కిందట అద్దెకు ఇచ్చా. అన్నయ్య కరోనా సమయంలో చనిపోయాడు. వదిన నాగలక్ష్మి, ఆమె కుమార్తె నీరజ కృష్ణవేణి ఇంట్లో ఉంటున్నారు. ఇద్దరు నాకు తెలియకుండా ఇంటిని ఫోర్జరీ దస్తావేజులు పుట్టించి వేరే వ్యక్తులకు విక్రయించారు.

- ఆనంద హేమలత, దేశాయిపేట, చీరాల

రొయ్యల చెరువులను కబ్జా చేయాలని యత్నం

నాకు పెదగంజాం మండల కేంద్రంలో సర్వే నంబర్ 553-2లో ఎకరం ఉంది. దాన్ని నా చెరువుల పక్కనే ఉన్న అవలదొడ్డిగొల్లపాలెం గ్రామానికి చెందిన గడ్డం కోటయ్య రాజకీయాన్ని అడ్డుపెట్టుకొని, పలుకుబడి ఉపయోగించి కబ్జా చేయాలని చూస్తున్నాడు. చినగంజాం పోలీసులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదు.

- మాచవరపు ప్రసాద్

చంపాలని చూస్తున్న భర్త

బాపట్ల మండలం, స్టువార్టుపురానికి చెందిన నాకు ఏడు సంవత్సరాల కిందట ఈపూరుపాలెం పరిధిలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన చంద్రకాంత్‌తో వివాహం జరిగింది. నా భర్త స్టువార్టుపురంలోనే ఉంటున్న సీహెచ్. శిరీషతో ఉంటూ నన్ను మానసికంగా, శారీరకంగా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాడు. అధిక కట్నం తీసుకురాకపోతే చంపుతానని బెదిరిస్తున్నాడు.

- కంపా కావేరి

దిమ్మెలను వరుసగా కూల్చేస్తున్నారు

కర్లపాలెం మండలంలోని ముస్లింపేట, షాదీఖానా బజార్‌లో నిర్మించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా దిమ్మెను పదేపదే గుర్తు తెలియని వ్యక్తులు కూల్చేస్తున్నారు. జూన్ 17న రాత్రి కూలిస్తే, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాం. తాజాగా ఆగస్టు 4న మరోసారి కూల్చారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా కూల్చడం ఆపడం లేదు. కనీసం కర్లపాలెం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కూడా లేరు. నెలల తరబడి ఇన్‌చార్జిలతోనే కాలం వెళ్లతీస్తున్నారు.

- పార్టీ నాయకులు ఫిర్యాదు

ఒంటరి మహిళపై యువకుల దాడి

చీరాల: ఒంటరిగా నివసిస్తున్న మహిళపై ముగ్గురు యువకులు దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటన చీరాల మండలం బోయినవారిపాలెంలో ఆదివారం రాత్రి జరిగింది. బోయిన పద్మ డాబాపై నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన కోటి మోహన్, బోయిన గోపి, బోయిన వెంకటేశ్వర్లు వెళ్లి ఆమెపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో పద్మ ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బెల్టు షాపులపై సెబ్ అధికారుల దాడులు

36 తెలంగాణ మద్యం సీసాల స్వాధీనం

రాజుపాలెం: మండలంలోని అనుపాలెం గ్రామంలో కొంత కాలం నుంచి మద్యం బెల్టు షాపులు యథేచ్ఛగా నడుపుతున్నారు. రెండు నెలల నుంచి ఇళ్ల మధ్యే ఉదయం 5 నుంచి రాత్రి 12 గంటల వరకు తెలంగాణ మద్యం విక్రయిస్తున్నారు. స్థానికులు ఎన్నిసార్లు అభ్యంతరం తెలపినా బెల్టు షాపుల నిర్వాహకులు బెదిరిస్తున్నారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తుల సమాచారం మేరకు సత్తెనపల్లి సెబ్ అధికారులు, సీఐ శ్రీనివాసరావు సోమవారం అనుపాలెంలోని సోదాలు చేశారు. రెండు బెల్టు షాపులపై దాడులు నిర్వహించగా, నడుపుతున్నవారు పారిపోయినట్లు తెలిసింది. శిఖా వాసు ఇంట్లో 36 తెలంగాణ మద్యం సీసాలు దొరికినట్లు సమాచారం.

దాడి బాధితుడికి వైఎస్సార్ సీపీ ఆర్థిక సాయం



ధర్నాసి రవికుమార్‌కు చెక్కు అందిస్తున్న గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తదితరులు

యడ్లపాడు: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం వైఎస్సార్ సీపీకి చెందిన వారిపై పలుచోట్ల టీడీపీ వారు దాడులకు తెగబడుతున్నారు. ఈ దాడుల్లో నష్టపోయిన వారికి వైఎస్సార్ సీపీ అధిష్టానం అండగా నిలుస్తోంది. యడ్లపాడు మండలం మైదవోలు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ ధర్నాసి రవికుమార్‌పై ఎన్నికల కౌంటింగ్ అనంతరం యడ్లపాడు గ్రామంలో టీడీపీకి చెందిన కొందరు దాడి చేశారు. గాయపడిన రవికుమార్‌కు మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.50 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన సదరు చెక్కును గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు సోమవారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో యడ్లపాడు మండలం పార్టీ అధ్యక్షులు ఘంటా శంకర్, వైఎస్సార్ సీపీ మైదవోలు గ్రామ సీనియర్ నాయకులు గౌరు రాజేష్ పాల్గొన్నారు.

కేరళ వరద బాధితులకు సాయం చేయండి



పట్టణంలో విరాళాలు సేకరిస్తున్న నాయకులు

సత్తెనపల్లి: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులకు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని వీధుల్లో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ.. భారీ వర్షాలకు కొండ చరియలు విరిగి పడి వందల మంది చనిపోయారని, వేలమంది నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ వాసులకు మన వంతు సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, పట్టణ నాయకులు అనుముల వీరబ్రహ్మం, కట్టా శివ దుర్గారావు, పంతంగి ప్రభాకర్, గడ్డం సుసులోన్, అనంత వెంకట్ నారాయణ, గద్దె ఉమశ్రీ, కంచర్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీసులపైనే చిరు వ్యాపారుల వ్యాఖ్యలు

అధికార పార్టీ అండ చూసుకుని అత్యుత్సాహం

యడ్లపాడు: ''ఇది మా ప్రభుత్వం... అంతా మా ఇష్టం .. అడగటానికి మీరెవరు.. మేం చెప్పింది మీరు వినాలి... అర్ధరాత్రి వరకు వ్యాపారం చేసుకుంటాం.. ఎందంటా'' అంటూ కూటమి ప్రభుత్వానికి చెందిన వారు బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలివి. పల్నాడు జిల్లా యడ్లపాడులో రాత్రి 11 గంటలకు చిరు వ్యాపారాలను నిలిపి వేయాలని చెప్పేందుకు వెళ్లిన పోలీసులకు ఎదురైన చేదు అనుభవం ఇది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6వ తేదీ రాత్రి ఎప్పటిలానే పోలీసులు గ్రామంలో గస్తీ నిర్వహణలో భాగంగా సర్వీసు మార్గాల వెంబడి ఉన్న చిరువ్యాపారాలు చేసుకునే వారిని లైట్లు ఆర్పాలని, దుకాణాల్ని మూసివేయాలని కోరారు. ఈ క్రమంలో సదరు దుకాణాల నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో అవాక్కయ్యారు. ప్రజల ముందు డిపార్టుమెంట్‌ను హేళన చేశారు. ఇది తెలిసి అక్కడికి వెళ్లిన మరో అధికారితో అవమానకరంగా మాట్లాడటంపై పోలీసులు, చిరువ్యాపారుల మధ్య వాగ్వాదం నెలకొంది. తమ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా చేసిన వ్యాఖ్యలపై పోలీసులు సీరియస్‌గా ఉన్నారు. మర్నాడు ఒకరిపై కేసు సైతం నమోదు చేశారు.

సాగర్ కుడి కాలువకు వెంటనే నీరు విడుదల చేయాలి

నరసరావుపేట: నాగార్జునసాగర్ కుడి కాలువ ఆయకట్టుకు వెంటనే నీటిని విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్లో గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు చేకూరి సురేష్ రాజా పాల్గొన్నారు

స్కీం వర్కర్లపై వేధింపులు తగవు

స్కీం వర్కర్లు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జోలికి వస్తే సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ఆంజనేయ నాయక్ హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం కూటమి ప్రభుత్వ రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆర్.పిలు, యానిమేటర్లు, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకంకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలి

శావల్యాపురం మండలం కారుమంచి, రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం గ్రామాల్లో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఏర్పాటు చేసే పైప్‌లైన్ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వీరికి 2013 భూ సేకరణ చట్టప్రకారం పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఈ గ్రామాల రైతులు కలెక్టర్‌కి గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందించారు.

ఆధిక్యంలో విజయనగరం జిల్లా జట్టు



ఆర్.సుమంత్‌వర్మ (5 వికెట్లు)



ఆర్.దామోదర్ (5 వికెట్లు)

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో భాగంగా సోమవారం అనంతపురం, విజయనగరం జిల్లాల మధ్య మ్యాచ్ ప్రారంభమయింది. టాస్ గెలిచిన అనంతపురం జిల్లా జట్టు బ్యాటింగ్ ఎంచుకొని తొలి ఇన్నింగ్స్‌లో 141 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని ఎ.జయంత్‌కృష్ణ 32 పరుగులు సాధించాడు. విజయనగరం బౌలర్ ఆర్.సుమంత్ వర్మ 7.1 ఓవర్లలో 22 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ ఆర్.దామోదర్ కూడా 12.1 ఓవర్లలో 62 పరుగులు ఇచ్చి 5 వికెట్లు సాధించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు నష్టపోయి 164 పరుగులు సాధించింది. జట్టు లోని బి.మధుసూధన్ 61 పరుగులతో క్రీజ్‌లో ఉండగా, కె.రుతిక్‌సంపత్ 51 పరుగులతో రాణించాడు. విజయనగరం జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో ఇప్పటికే 23 పరుగుల ఆధిక్యం లభించింది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

బైకును ఢీకొట్టిన కారు: ఒకరి మృతి

మరొకరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హరిబాబు

అద్దంకి రూరల్: వేగంగా వస్తున్న కారు రోడ్డు దాటుతున్న బైక్‌ను ఢీకొట్టటంతో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం అద్దంకి మండలంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన జె. చిట్టిబాబు (32), హరిబాబు పని నిమిత్తం అద్దంకి మండలంలోని చక్రాయపాలెం వచ్చి పొగాకు కుప్పలు వేసే పని చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం అద్దంకి-నార్కెట్‌పల్లి నామ్ రహదారి పైనుంచి మండలంలోని చక్రాయపాలెంలో ఇద్దరు బైక్‌మీద రోడ్డు దాటుతున్నారు. ఈక్రమంలో హైదరాబాద్ వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి బైకును ఢీకొట్టింది. ఈప్రమాదంలో చిట్టిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. హరిబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనం ద్వారా అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. చిట్టిబాబు మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలోని రిమ్స్ తరలించారు.

వైఎస్సార్ సీపీ జెండా దిమ్మె ధ్వంసం హేయమైన చర్య



దుండగుల చేతిలో ధ్వంసమైన దిమ్మె

కర్లపాలెం: వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెను గుర్తు తెలియని వ్యక్తులు రెండోసారి ధ్వంసం చేయడం హేయమైన చర్య అని ఆ పార్టీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు ఖండించారు. గత ఆదివారం రాత్రి కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఎంవీరాజుపాలెంలోని గమేషన్ మిల్లు సెంటర్‌లో జెండా దిమ్మెను దుండగులు ధ్వంసం చేశారు. ఏడుకొండలు మాట్లాడుతూ జూన్ నెల 18న ఇదే దిమ్మెను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో అప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. అప్పుడే దర్యాప్తు చేసి దుండగుల్ని పట్టుకుని చట్ట ప్రకారం శిక్షించి ఉంటే మళ్లీ ఇప్పుడు ఈ ఘాతుకానికి పాల్పడే వారు కాదని తెలిపారు. ఇప్పటికి రెండుసార్లు జెండా దిమ్మెను ధ్వంసం చేయడంపై బాపట్ల వెళ్లి ఎస్పీకి ఫిర్యాదు చేశామని చెప్పారు. ఇప్పటికైనా దోషుల్ని పట్టుకుని శిక్షించాలని పోలీసుల్ని కోరారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త అక్తర్ హుస్సేన్

పిట్టలవానిపాలెం: భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అక్తర్ హుస్సేన్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో సోమవారం ఆత్మ గుంటూరు వారి సౌజన్యంతో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఏడీఏ అక్తర్ హుస్సేన్ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడటం వల్ల ఖర్చులు ఆదాతో పాటు నేల స్వభావం బాగుంటుందని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అనుసరించాల్సి సాగు పద్ధతుల గురించి తెలియజేశారు. ఏరువాక కేంద్రం శాస్త్ర వేత్త ఉష మేలైన వరి వంగడాల గురించి తెలిపారు. వరి పైరుకు అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్ వాడకాలతో పాటు ఎకరానికి ఎరువుల మోతాదు గురించి వివరించారు. కార్యక్రమంలో బాపట్ల ఏడీఏ లక్ష్మి, మండల వ్యవసాయాధికారి సత్యానంద్, బాలమురళీధర్ నాయక్ ఏఈఓలు సుదర్శనరావు, శేషమ్మ, శివనాగేశ్వరి పాల్గొన్నారు.

టెండర్లు రద్దు చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటా!

- సత్తెనపల్లిలో టీడీపీ అభిమాని హల్‌చల్
- డిపో మేనేజర్ కార్యాలయం ముందు గొడవ
- సక్రమంగానే ఉన్నందున రద్దు కుదరదని డీఎం వెల్లడి



డిపో మేనేజర్ కార్యాలయం ముందు మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు



డిపో మేనేజర్ కార్యాలయం ముందు నేలపై కూర్చున్న శ్రీనివాసరావు

నరసరావుపేట: ఇటీవల ఆర్టీసీ యాజమాన్యం జిల్లా వ్యాప్తంగా డిపోలవారీగా పిలిచిన పారిశుద్ధ్య నిర్వహణ టెండర్లు రద్దు చేయాలని కోరుతూ సత్తెనపల్లికి చెందిన అధికార టీడీపీ అభిమాని ఎలినీడి శ్రీనివాసరావు సోమవారం నరసరావుపేట డిపో మేనేజర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. సాయంత్రం నాలుగు గంటల్లోగా రద్దు చేయకపోతే తాను ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. టెండర్లలో ఎలాంటి అవకతవకలు జరగలేదని, సదరు వ్యక్తి కనీసం టెండర్ కూడా దాఖలు చేయలేదని డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి మీడియాకు వెల్లడించారు. వివరాలు.. గత నెలలో జిల్లావ్యాప్తంగా పలు డిపోలలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం టెండర్లు ఆహ్వానించారు. నరసరావుపేట డిపోలో నెలకు రూ.2 లక్షలకు టెండర్ పిలిచారు. టెండరు నోటిఫికేషన్ జిల్లాలోని పలు డిపోలకు పంపారు. గడువుకు ఒకరోజు ముందే సత్తెనపల్లి డిపో నోటీసు బోర్డులో పెట్టారని, కనీసం వారం రోజుల ముందు పెట్టాలని, ఇది నిబంధనలకు విరుద్ధమని శ్రీనివాసరావు వాదిస్తున్నారు. నరసరావుపేట డిపోలో మరుగుదొడ్లు, బస్సుల వాషింగ్, బస్టాండ్ స్వీపింగ్, సైకిల్ స్టాండ్ తదితర అన్ని పనులకు చెందిన పనులు గత ఏడెనిమిదేళ్లుగా సాంబశివరావుకు చెందిన వ్యక్తులకే దక్కేలా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. టెండరు ఎవరు దక్కించుకున్నా సదరు సాంబశివరావుకే అప్పగించేలా అధికారులు చేస్తున్నారని పేర్కొన్నారు. పనిచేసేందుకు 60 ఏళ్లకుపైగా వయస్సు ఉన్న వృద్ధులను పెడుతున్నారని, ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. తాను ఆరోపించిన వాటిని నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. దీనిపై డిపో మేనేజర్ మీడియాకు వివరణ ఇస్తూ.. తాము నరసరావుపేట డిపోలో పారిశుద్ధ్య పనులు చేసేందుకు టెండరు పిలవగా నాలుగు దరఖాస్తులే వచ్చాయని అన్నారు. వాటిలో లలిత పరమేశ్వరి సోషల్ వెల్ఫేర్ సొసైటీ రూ.1,31,974లకు తక్కువ మొత్తానికి దాఖలు చేసిన టెండర్‌ను ఆమోదించామన్నారు. దీనిపై సదరు శ్రీనివాసరావు వచ్చి రద్దు చేయాలని కోరాడని తెలిపారు. తాము కుదరదని చెప్పామని అన్నారు. రద్దు చేసేంత వరకు ధర్నా చేస్తానని తన కార్యాలయం ముందు కూర్చున్నాడన్నారు. కాగా, డిపో అసిస్టెంట్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ రంగ ప్రవేశం చేసి అతడిని విచారించారు. అక్కడి నుంచి లేచి రావాలని కోరారు. అయితే సదరు వ్యక్తి నేలపై పడుకున్నాడు. సదరు శ్రీనివాసరావు కొంతమంది వ్యక్తులతో మాట్లాడుతూ తాను అధికార పార్టీకి చెందిన వ్యక్తినైనా, ఎన్నికల సమయంలో చంద్రబాబుకు రూ.లక్ష విరాళం ఇచ్చినా ఉన్న ఫళంగా తాను పలు డిపోలలో చేస్తున్న కాంట్రాక్టులు అన్నీ తీసివేశారని అన్నారు. తాను రూ.30 లక్షల విలువచేసే కారులో ఇక్కడకు వచ్చానని, దానికి టీడీపీ జెండా గుర్తు కూడా ఉందని చెప్పుకోవటం విశేషం. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.

విత్తనోత్పత్తి పథకంపై శిక్షణ



మాట్లాడుతున్న డీడీఏ శివకుమారి

నరసరావుపేట రూరల్: నాణ్యమైన విత్తనాలను సరైన సమయంలో సరైన ధరకు రైతులకు అందించడమే విత్తనోత్పత్తి పథకం లక్ష్యం అని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి తెలిపారు. మండలంలోని పెట్లూరివారిపాలెంలో రైతు సేవా కేంద్రంలో సోమవారం గ్రామ విత్తనోత్పత్తి పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీడీఏ శివకుమారి, ఏడీఏ పి.మస్తానమ్మ, ఏవో నరేంద్ర బాబులు పాల్గొన్నారు. డీడీఏ శివకుమారి మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలను రైతులకు అందిస్తే వారు 15 శాతం అధిక దిగుబడులు పొందొచ్చని తెలిపారు. ప్రస్తుతం డివిజన్‌లో సాగు చేసేందుకు అనుకూలంగా ఉన్న విత్తన రకాలను ఏడీఏ మస్తానమ్మ వివరించారు. నాగార్జునసాగర్‌లో నీటి విడుదలపై నెలకొన్న సందిగ్ధత వల్ల రైతులు స్వల్పకాలిక విభాగంలోని జేజీఎల్-383 రకంపై ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఈ రకానికి ప్రత్యామ్నాయంగా జేజీఎల్-27356, ఎంటీయూ-1224, ఎంటీయూ-1282, బీటీపీ-5204 రకం వంగడాలను సాగు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏవో ప్రవీణ్, గ్రామ టీడీపీ నాయకులు కె.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లారీ క్లీనర్ మృతి

కర్లపాలెం: విద్యుదాఘాతంతో లారీ క్లీనర్ మృతి చెందిన సంఘటన సోమవారం కర్లపాలెం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెనాలికి చెందిన షేక్ మీరా సాహెబ్(67) లారీ క్లీనర్‌గా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం తెనాలి నుంచి బ్లీచింగ్ లోడు లారీలో కర్లపాలెం వచ్చాడు. మసీదు సమీపంలోకి వచ్చిన లారీ క్యాబిన్ పైకి ఎక్కి పట్టా తీస్తుండగా పైనున్న తీగలు తగిలి విద్యుదాఘాతంతో కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని కుమారుడు షేక్ రబ్బాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.